క్లుప్తంగా

విద్యార్థులకు 'శుభదిన్' భోజనం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ బాబ్జి

పాకాల : మండంలోని కొడేపల్లె ఎంపీపీ పాఠశాలలో బుధవారం శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో శుభదిన్ భోజన్ కింద దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం అందించారు. ఎంఈఓ బాబ్జీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. పిల్లలకు రుచికరంగా భోజనం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటస్వామి, దాత సులోచన, ఉపాధ్యాయుడు రామకృష్ణ పాల్గొన్నారు.

టీటీడీ ఈఓను కలిసిన ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్



ఈఓకు పుష్పగుచ్ఛం అందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఈఓ జె.శ్యామలరావును ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా ఉన్నప్పుడు ఎస్వీయూతో తనకున్న అనుబంధాన్ని ఈఓ గుర్తు చేసుకున్నారు. ఎస్వీయూ అధికారులు టీటీడీ నుంచి రావాల్సిన నిధులపై ప్రస్తావించగా సానుకూలంగా స్పందించారు. ఎస్వీయూ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఈఓ హామీ ఇచ్చారు.

'సాహస జీవితం' కవితకు పురస్కారం



ఉత్తమ పురస్కారం అందుకుంటున్న తవితా తులసి

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ పి.తవితా తులసి రచించిన ×సాహస జీవితం€ కవితకు ఉత్తమ సామాజిక చైతన్య పురస్కారం లభించింది. గోదావరి కవితోత్సవాలలో భాగంగా బుధవారం పిఠాపురంలోని రాజా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన 137వ జాతీయ శతాధికవి సమ్మేళనంలో ఆమె ఈ పుస్కారం అందుకున్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్నరాజప్ప, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఆమెను సత్కరించి పురస్కారం ప్రదానం చేశారు.

సచివాలయానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుమల : తిరుమలలోని బాలాజీ నగర్‌లో సచివాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బుధవారం భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ.50లక్షల వ్యయంతో భవనం నిర్మించనున్నట్లు వెల్లడించారు. తిరుమల వాసులకు త్వరలోనే సచివాలయం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

ప్రారంభమైన మహాభారత ఉత్సవాలు




ధ్వజారోహణం చేస్తున్న దృశ్యం

పాకాల : మండలంలోని దామలచెరువు పంచాయతీ మొబ్బినాయనపల్లెలో మంగళవారం మహాభారత ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. నిర్వాహకుడు మొబ్బినేని రఘుపతి మాట్లాడుతూ మొబ్బినేని చైతన్యకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం భాగవతారిణి రెడ్డికుమారి హరికథా కాలక్షేపం, రాత్రి మల్లికార్జున బృందం నాటక ప్రదర్శన ఉంటుందని వివరించారు. ఉత్సవాలకు ధ్వజారోహణతో శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు.

ఇంటి వద్దకే పింఛన్

తిరుపతి తుడా : నగరంలో గురువారం ఉదయం 5 గంటల నుంచే ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మొత్తం 102 సచివాలయాల పరిధిలో 19,191 మంది లబ్ధిదారులకు రూ.8.29 కోట్లను మీ ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది, అధికారులకు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. లబ్ధిదారులు అందరూ ఇళ్ల వద్దే అందుబాటులో ఉండాలని కమిషనర్ కోరారు.





అయ్యో వినాయకా

తిరుపతి నగరంలోని వినాయకసాగర్ వ్యర్థాలతో నిండిపోయింది.. పట్టించుకునేవారు లేక చెత్తాచెదారాలతో కాలుష్య కాసారంగా మారిపోయింది.. గత ఏడాది గణేష్ నిమజ్జనం తర్వాత శుభ్రం చేయకపోవడంతో విగ్రహ శకలాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది.. వినాయకచవితి ఉత్సవాలు సమీపిస్తున్న తరుణంలో పురపాలక యంత్రాంగం తగు చర్యలు చేపట్టాలని ప్రజానీకం కోరుతోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అవిలాల ఏఈపై ఫిర్యాదుల వెల్లువ

తిరుపతి రూరల్ : తిరుపతి టౌన్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ సమస్యలపై మంగళవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వినియోగదారుల నుంచి ఈఈ వాసుదేవన్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అవిలాల ట్రాన్స్‌కో ఏఈ నాగరాజుపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు డబ్బులు డిమాండ్ చేశారని, 2022లో నగదు ముట్టజెబితే ఇప్పటికి కూడా అమర్చకుండా కాలయాపన చేస్తున్నారని అవిలాలకు చెందిన మురళీకృష్ణ అనే వ్యక్తి ఆరోపించారు. తాము చెల్లించిన నగదును తిరిగి ఇవ్వాలంటే కూడా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని ఆధారాలను ఈఈ వాసుదేవన్‌కు అందజేశారు. అలాగే చక్ర గార్డెన్స్‌కు చెందిన అరుణ్‌కుమార్, రామచంద్ర సైతం ఏఈ నాగరాజుపై ఫిర్యాదు చేశారు. 10 విద్యుత్ మీటర్లకోసం ఈ ఏడాది జనవరిలో దరఖాస్తు చేసుకున్నామని, అయితే ఎస్టిమేషన్ వేయకుండా 7 నెలలు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఈఈ వాసుదేవన్ విచారించి అర్జీదారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మొక్కలు నాటండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల ఆవరణల్లో పెద్దఎత్తున మొక్కలు పెంచాలని సూచించారు. మెరుగైన వసతులు కల్పించాలని చెప్పారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాణ్యమైన భోజన వసతి కల్పించాలని సూచించారు. డీఈఓ వి.శేఖర్, డీపీఓ సుశీలాదేవి, ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా శిశు సంక్షేమ అధికారి జయలక్ష్మి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా పవిత్రోత్సవాలు ప్రారంభం



సీతారామలక్ష్మణులకు తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్ : శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో బుధవారం పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏడాది పొడవునా శ్రీవారికి నిర్వహించే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాల కారణంగా ఆలయ పవిత్రతకు లోపం రాకుండా ఆగమశాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా ఉదయం సీతారామ సమేత లక్ష్మణస్వామి వారి ఉత్సవ మూర్తులను విమాన ప్రదక్షిణగా యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరినీళ్లతో స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు. శాత్తుమొర, ఆస్థానం జరిపించారు. సాయంత్రం సీతారామలక్ష్మణులను బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు. రాత్రి పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం చేపట్టారు. కార్యక్రమాల్లో డిప్యూటీ ఈఓ నాగరత్న, కంకరణభట్టార్ సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ సోమశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్ పాల్గొన్నారు.

సమన్వయంతో చవితి వేడుకలు



మాట్లాడుతున్న సామంచి శ్రీనివాస్

తిరుపతి కల్చరల్ : వినాయక చవితి వేడుకలను అందరినీ సమన్వయం చేసుకుంటూ వైభవంగా నిర్వహించుకోవాలని వినాయక ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఈమేరకు బుధవారం బాలాజీ కాలనీలో కమిటీ సమావేశం నిర్వహించారు. చవితి వేడుకలను మరింత ఘనంగా జరుపుకునేందుకు విధి విధానాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ హితమైన, ప్లాస్టిక్ రహిత వినాయక స్వామి విగ్రహాలు ప్రతిష్ఠించుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే వినాయకసాగర్‌లో చేయాల్సిన మా ర్పులను నగర పాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసు కెళ్లాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు మాంగాటి గోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, భానుప్రకాష్‌రెడ్డి ,గుండాల గోపీనాథ్‌రెడ్డి , వేణుగోపాల్ నాయుడు, హేమ, ఆనంద్, కిరణ్, చందు రాయల్, మణికంఠ, సదాశివం, కృష్ణయ్య, చెంగారెడ్డి పాల్గొన్నారు.

టెక్నాలజీపై అవగాహన అవసరం



వర్క్‌షాప్‌కు హాజరైన ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, నికాన్ కంపెనీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : ఫొటో, వీడియోగ్రఫీ వృత్తిలో రాణించాలంటే అందుబాటులో ఉన్న అధునాతన టెక్నాలజీపై అవగాహన అవసరమని నికాన్ కంపెనీ ప్రతినిధి నాని నరేంద్ర తెలిపారు. బుధవారం ఓ ప్రైవేట్ హోటల్‌లో తిరుపతి, తిరుమల ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ వర్క్‌షాప్ నిర్వహించారు. నాని నరేంద్ర మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాల మెళకువలను అందిపుచ్చుకుని అభివృద్ధి పథంలో పయనించాలని కోరారు. ఇలాంటి వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకోవాలని సూచించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక టెక్నాలజీ కెమెరాల గురించి మరింత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీటీడీ ఫొటో గ్రాఫర్ శేఖర్, శేషాచలం ట్రెక్కింగ్ నిర్వాహకులు బీవీ రమణ, బాలసుబ్రమణ్యంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పూసపాటి మోహన్‌రాజ్, కార్యదర్శి అమర్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఆర్ రాజు, రాధాకృష్ణ, పురంధర్, రహమతుల్లా, సురేష్, హేమంత్, కృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన వారితో ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న వెస్ట్ ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి, నాయుడుపేట ఏఎస్‌ఐ విజయ్ భాస్కర్, డీసీఆర్‌బీ హెడ్‌కానిస్టేబుల్ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా తిరుపతి పోలీసు అతిథిగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని ఎస్పీ సుబ్బరాయుడు ఘనంగా సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో చేరి ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయంగా మిగిలిపోతాయని కొనియాడారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

తిరుపతి తుడా : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మౌర్యను బుధవారం 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ



మాట్లాడుతున్న ప్రకృతి వనం ప్రసాద్

రామచంద్రాపురం: పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యత భావించాలని ప్రకృతి వనం వ్యవస్థాపకుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి మనకు ఎన్నో రకాల ఔషధాలను ఇచ్చిందని, వీటి ద్వారా దీర్ఘకాల వ్యాధులను సైతం నయం చేయవచ్చని చెప్పారు. మొక్కలు మానవుడికి ఎన్నో ప్రయోజనాలను ఇచ్చే సిరులని తెలిపారు. కార్యక్రమంలో సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్‌బాబు, కరస్పాండెంట్ సుమలత పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీకృష్ణుని చిద్విలాసం



తిరుచ్చిపై ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారికి అనుబంధంగా వెలసిన శ్రీకృష్ణ స్వామివారు అమ్మవార్లతో కలసి బుధవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రం రోహిణిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి బంగారు తిరుచ్చిపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదారు చిరంజీవి పాల్గొన్నారు.

ముగిసిన ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు

పాకాల : ఆనందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉత్సవ కమిటీ చైర్మన్ సొంపల్లి చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో యాగపూజ, పూర్ణాహుతి, కలశాభిషేకం, తోటోత్సవం, కంకణ విసర్జన, ధ్వజావరోహణం, పాన్పుసేవ నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమాలకు వెలకటూరి రామచంద్రనాయుడు, మధుమోహన్ చౌదరి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నిరంతర సాధన అవసరం



విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న ముఖ్యఅతిథులు

తిరుపతి సిటీ : నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే నిరంతరం సాధన అవసరమని అనంతపురం జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు సూచించారు. బుధవారం కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేకి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సుదర్శనరావు మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో యువతకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని, స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఏబీటీయూసీ చీఫ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ బుద్ధా చంద్రశేఖర్ మాట్లాడుతూ అధునాతన టెక్నాలజీతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, కోర్సులను ఏబీటీయూసీ అందిస్తోందని తెలిపారు. ప్రపంచంలోనే మన దేశ విద్యార్థులకు ప్రత్యేక గౌరవం ఉందన్నారు. కళాశాల చైర్మన్, వైస్ చైర్మన్ గంగిరెడ్డి, ప్రకాష్ మాట్లాడుతూ ఎస్వీసీఈ కళాశాల విద్యార్థులు దేశవిదేశాలలో రాణిస్తున్నారని వెల్లడించారు. దేశంలోనే ఎస్వీసీఈ టాప్ వంద కళాశాలల్లో ఒకటిగా చోటు దక్కించుకోవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం 850 మంది బీటెక్ పూర్తి చేసి విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. వీరిలో ఏడుగురు విద్యార్థులు గోల్డ్‌మెడల్ అందుకోవడం విశేషం. కార్యక్రమంలో కలికిరి జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, ఎస్వీసీఈ ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల పనులు వేగవంతం



వినాయక సాగర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : తిరుపతి కార్పొరేషన్ పరిధిలో అన్న క్యాంటీన్ల పనులు వేగవంతం చేసి ఈ నెల 5వ తేదీలోపు సిద్ధం చేయాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ముందుగా రాజన్న పార్కు సమీపంలోని మస్టర్ గది వద్ద ఉద్యోగుల హాజరు నమోదును పరిశీలించారు. సిబ్బంది టైమ్ ప్రకారం విధులకు హాజరుకావాలని, మరింత మెరుగ్గా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. అనంతరం స్విమ్స్ కూడలి, న్యూ బాలాజీ కాలనీ, ముత్యాలరెడ్డిపల్లె, ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద అన క్యాంటీన్ల పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వినాయకసాగర్ వద్ద గల 5 ఎంఎల్‌డీ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 5లోపు అన్ని హంగులతో అన్న క్యాంటీన్లు సిద్ధం చేయాలని, 15వ తేదీన ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడించారు. వినాయకసాగర్ లో మరుగుదొడ్లు ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలని కోరారు. సాగర్‌ను వెంటనే శుభ్రం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, డీఈలు మహేష్, శ్రావణి, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

ఎస్వీయూ డెవలప్‌మెంట్ డీన్‌గా బాలాజీ



నియామక పత్రం అందుకుంటున్న బాలాజీ

తిరుపతి సిటీ : ఎస్వీయూ డెవలప్‌మెంట్ విభాగం డీన్‌గా బయో కెమిస్ట్రీ ప్రొఫెసర్ బాలాజీని నియమిస్తూ బుధవారం ఇన్‌చార్జి వీసీ డాక్టర్ అప్పారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన వీసీ, రిజిస్ట్రార్ చేతులు మీదుగా నియామకపత్రం అందుకుని బాధ్యతలు చేపట్టారు.

స్వాగతమేనా?

తిరుపతిలోని నగరవనం స్థానికులతోపాటు యాత్రికులకు సైతం ఆహ్లాదం పంచేది. ముఖ్యంగా పార్కులోకి స్వాగతం పలికే ముఖద్వారం సందర్శకులను ఆకట్టుకునేది. అయితే ఇటీవల వచ్చిన ఈదురుగాలులకు ఈ ద్వారం ధ్వంసమైంది. అధికారులు పట్టించుకోకపోవడంతో కళావిహీనంగా దర్శనమిస్తోంది. ఇప్పటికైనా సంబంధితశాఖ సిబ్బంది మరమ్మతులు చేయించాలని నగర ప్రజానీకం కోరుతోంది.

- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

నాడు



నేడు

